# ముద్రలు - అభినయాలు

నాకు మొదటినించీ కూచిపూడి నృత్యమంటే ఎంతో అభిమానం. మిగతా అన్ని నాట్యాలకన్నాకూడా కూచిపూడి నృత్యంలో అభినయానికున్న ప్రాముఖ్యత ఇంకే నృత్యకళలో కనపడదు. ఈ అభినయం మీద నాకున్న అభిమానమే కారణమేనేమో, ఎవర్ని చూసినా వాళ్ళ అభినయాన్ని పరిశీలించటం అలవాటయిపోయింది నాకు. ఇంతకుముందు, తింటే గారెలే తినాలి అనే ఉపాఖ్యానంలో ప్రపంచంలో రకరకాల దేశాల్లో ఆహార విషయాలెలా వుంటాయో చెప్పుకున్నాం కదా, అలాగే ఈసారి దేశదేశాల్లో ఈ అభినయాలెలా వుంటాయో చెప్పాలనిపిస్తోంది.

* * *

ఒకచోట అవలంభించే ముద్రలు అభినయం మంచివయితే అదే ఇంకోచోట అభ్యంతరకరమయే అవకాశముందని అమెరికా వెళ్ళిన నాలుగు ఐదు నెలల్లోనే అర్థమయిపోయింది.

మా ఆఫీసుల్లో మీటింగులప్పుడు, నాకు చేతులు కట్టుకు కూర్చోవటం అలవాటు. దానికి కారణాలు రెండు. ఒకటి అలా కూర్చోవటం నాకు ఇండియాలో అలవాటయింది కనుక. రెండవది, మా కాన్ఫరెన్స్ రూమ్‌లో బాగా చలిగా వుంటుంది కనుక. ఒకసారి మా బాసుడు తన రూమ్‌కి పిలిచి "నువ్వు మీటింగుల్లో ఎవరికీ పట్టనట్టు కూర్చుంటున్నావుట. ఏదన్నా డెసిషన్ తీసుకోవాలనుకుంటున్నప్పుడు- మీ ఇష్టమొచ్చినట్టు చేసుకోండి. మీ అభిప్రాయాలతో నాకేమీ సంబంధం లేదు అనే భావన కలిగిస్తున్నావుట. ఎందుకని?" అని అడిగాడు. నాకు అర్థమయిందిది. అమెరికాలో చేతులు కట్టుకు కూర్చుంటే, ఐ యామ్ క్లోజ్డ్ ఫర్ యువర్ ఒపీనియన్స్. నా భావాలు నావి. మీ భావాలతో పనిలేదని అర్థం. ఆయనతో చెప్పాను, అయ్యో! నన్ను అపార్థం చేసుకున్నారు. మా దేశంలో, మా సంస్కృతిలో అలా చేతులు కట్టుకు కూర్చుంటే, మీరేం చెబితే నేనది చేయటానికి రెడీ అనే అర్థంతో మర్యాదగా కూర్చోవటమని నచ్చచెప్పాల్సి వచ్చింది. తర్వాత అలా కూర్చోవటం మానేశాను. ఎందుకంటే అలా కూర్చోటం అమెరికాలో నా భవిష్యత్తుకి మంచిది కాదు కనుక.

అలాగే ఇండియాలో చూపులు కలిసిన శుభవేళా అని ప్రేయసీ ప్రియులకి చూపులు కలుస్తాయి. ఒకళ్ళ కళ్ళల్లోకి ఒకళ్ళు చూసుకుంటారు. కళ్ళల్లో కళ్ళు పెట్టి ఏ మేనేజరు కళ్ళల్లోకో, ప్రొఫెసర్‌గారి కళ్ళల్లోకో చూస్తే, మనకి మర్యాద ఇవ్వటం తెలీదని, పైగా పీడికి తల పొగరు, ఆ చూపు చూడు, ఎంత ధైర్యంగా కళ్ళల్లోకి చూస్తున్నాడో అంటారు. అమెరికాలో బాసుడి కళ్ళల్లోకే కాక, పక్కింటమ్మాయి కళ్ళల్లోకి కూడా గోముగా చూసి మాట్లాడాలి. అలా చేస్తే, చూస్తే మనం వాల నిజాయితీపరులమనీ, మనల్ని నమ్మవచ్చనీ వీరి నమ్మకం. చూడకు చూడకు చూడకు అనే పాటని గుర్తుకు తెచ్చుకుని, ఎటో చూస్తూ మాట్లాడితే,

మనమేవో అబద్ధాలు చెబుతున్నామనీ, ఏదో తప్పు చేస్తున్నామనీ అందుకే చూపులు తప్పిస్తున్నామనీ అనుకుంటారు. అదే సౌత్ అమెరికాలో అయితే- కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడితే, మనం పోట్లాటకి సిద్ధమవుతున్నామనుకుంటారు.

అమెరికాలో నవ్వాలీ నవ్వాలీ నీ నవ్వులు నాకే ఇవ్వాలీ అనుకుంటారు. నవ్వకపోతే ఇక్కడ స్నేహ పూరితంగా వుండదు. ఫార్‌ఈస్ట్ ఆసియాలో సిగ్గుపడ్డప్పుడో, ఆశ్చర్యం వేసినప్పుడో మాత్రమే నవ్వటం సహజం. వియత్నాంలో చక్కలిగిలి పెట్టినా నవ్వరు. ఫ్రాన్స్‌లో ఎక్కువగా నవ్వేవాడిని, చాల సాధారణ మనిషిగా చూస్తారు. జర్మనీలో అయితే నవ్వులు కుటుంబ సభ్యులకి మాత్రమే పరిమితం.

కళ్ళూ, పళ్ళూ గురించి మాట్లాడుకున్నాం, మరి చేతులు కలవటమో. అంటే హాండ్ షేక్ అన్నమాట. ఇండియాలోనూ, మిగతా ఆసియా దేశాలలోనూ, చేయి పూరికే అందిస్తారు. అది అమెరికాలో పేలవంగా వుంటుంది. గట్టిగా చేయి పట్టుకుని వూపితే, మనతో బిజినెస్ చేయటానికి ఇష్టపడతారు. నిర్దుష్టమైన అభిప్రాయాలు వున్నవాళ్ళనీ మాట తప్పరనీ నమ్ముతారు. మగవారైతే ముస్లిమ్ లేదా జ్యూయిష్ అమ్మాయితో షేక్‌హాండ్ చేస్తే వాళ్ళకి నచ్చకపోయే అవకాశం వుంది. అలాగే ఆసియా వెళ్ళినప్పుడు, నమస్కార పూర్వకంగా నడుం వంచి మర్యాద చేయటం అవసరం. చైనా జపాన్ కొరియా దేశాల్లో, అవతలి మనిషి స్థోమత పదవి నిబట్టి వంగుతారు. ఉదాహరణకి మీరే బాస్ అయితే మీకింద పనిచేసేవాళ్ళు బాగా వంగి మర్యాద చూపిస్తారు. మీరు వాళ్ళ దగ్గర అంతగా నడుం వంచవలసిన అవసరం లేదు. మీ నాన్నగారి దగ్గరా మీరు నడుం ఎక్కువ వంచాలి. అలాగే ముద్దులు. మిడిలీస్ట్‌లో, లాటిన్ అమెరికాలో, కొన్ని ఆఫ్రికా దేశాల్లో, ఒకళ్ళకొకళ్ళు బుగ్గలు ఆనించుకుని ముద్దులు పెట్టుకోవటం పలకరింపుల మర్యాద. మిడిలీస్ట్‌లో మగవాళ్ళ మధ్య మాత్రమే సుమా. అక్కడ ముద్దులతోపాటూ కౌగలింత కూడా సహజమే. కానీ అమెరికాలో కౌగలింత ఆడమగ తేడా లేకుండా సర్వసాధారణం. ఆప్యాయంగా పలకరింపులప్పుడూ అప్పగింతలప్పుడూ చూస్తూవుంటాం. బ్రెజిల్‌లో మాత్రం రెండు మూడుసార్లు బిజినెస్ మీటింగుల్లో కలిస్తేగానీ, బుగ్గమీద ముద్దు పెట్టుకోరు.

ఇక పిలుపులెలా వుంటాయో చూద్దాం. అమెరికాలో మొదటి పరిచయంతోనే పేరులే పిలుస్తారు అంటే సూరీ అనీ, జాన్ అనీ, లీసా అనీ. అదే ఇంగ్లాడ్‌లోనూ, మిగలా చాల దేశాల్లోనూ మనుష్యులు బాగా దగ్గరమేదాకా ఇంటిపేరుతో మర్యాద పదం జోడించి పిలవటం అవసరం. మిస్టర్ మందపాటి మిసెస్ మిల్లర్ అని. అదే లాటిన్ అమెరికాలో అయితే వాళ్ళ ఉద్యోగాల పేర్లతో, అంటే డాక్టర్ బారియాంటోస్, ప్రొఫెసర్ ప్రుడెంషియో అని పిలవటం మర్యాద.

అభినయాలు ఇలా వుంటే మరి ముద్రలెలా వుంటాయో చూద్దాం. ఎవర్నెయినా పిలవాలంటే ఇండియాలో కుడి చేయి బోర్లించి బొటన వ్రేలు తప్ప మిగతా నాలుగు వేళ్ళూ కదుపుతూ పిలుస్తాం. అదే అమెరికాలో వేళ్ళు మన పద్ధతిలోనే ముడుస్తారు కానీ, అరిచేయి పైకెత్తి చూపుడు వేలిలో పిలుస్తారు. మనకి ఆ పద్ధతి అంత మర్యాదగా వుండదు కానీ, ఆ పిలుపు ఇక్కడ మర్యాదగా వున్నట్టే లెఖ్ఖ.

జపాన్‌వారి పిలుపు నాకు బాగా నచ్చింది. అరిచేయి పూర్తిగా జాపి, చాల నెమ్మదిగా పైకీకిందకీ కదుపుతారు. కూచిపూడి ముద్రలా ఎంతో అందంగా వుంటుంది.

బొటనవేలు పైకెత్తితే అంతా సవ్యంగానే వుందని అర్థం మనకి. అమెరికన్లకే మిగతా చాల దేశస్థులకీ కూడా అంతే. అమెరికాలో వేలుని కొంచెం అటూ ఇటూ వూపితే లిఫ్ట్ కావాలనీ దారిని పోయే కార్లని ఆపమనీ అర్థం. మిడిల్‌ఈస్ట్‌లోనూ, నైజీరియాలాటి ఆఫ్రికా దేశాలలోనూ అది చాల అశ్లీలం. అభ్యంతరకరం. అదే జపాన్‌లో ఐదవ అంకెకి సంకేతం. మనం చాల బాగుంది అని చెప్పటానికి బొటన వేలూ, చూపుడు వేలూ ఒక రింగులా చేసి మరీ చూపిస్తాం. ఫ్రాన్స్‌లో అది సున్నా అని అర్థం. డెన్మార్క్‌లో, ఇటలీలో అది ఇతరులని కించపరచటానికి వాడతారు. బ్రెజిల్ గౌతమేలా పారాగ్వాయ్‌లలో అది చాల అసభ్యమైన సంకేతం.

మనం చూపుడు వేలు చూపించి, ఒక వస్తువునో మనిషినో చూపిస్తాం. అమెరికాలో అలా వస్తువుని చూపించవచ్చు కానీ, మనిషిని చూపించటం మర్యాద కాదు. ఆసియాలో మొత్తం చేయి అంతా చాపి చూపిస్తారు. మలైషియాలో బొటన వేలితో చూపిస్తారు.

అలాగే తల వూపటం. అమెరికాలో అవునంటే తల పైకీ కిందకీ వూపుతారు. వద్దంటే (కాదంటే కూడా) తల ఒక పక్క నించీ ఇంకో పక్కకి వూపుతారు. ఇండియాలో వద్దు అన్నది అలాగే వుంటుంది కానీ, అవును అన్నప్పుడు తల పైకీ కిందకేకాక, గుండ్రంగా తిరుగుతూ వుంటుంది. అది చూసిన అమెరికన్లకి అవునో కాదో అర్థం కాదు.

ఎప్పుడో ఎఎమ్ రాజా "అవునంటే కాదనిలే... కాదంటే అవుననిలే" అని ఒక పాట పాడాడు. అమెరికన్లు అవుననో కాదనో నిర్దుష్టంగా చెబుతారు. అదీ ఒకే సారి. మళ్ళీ మళ్ళీ చెప్పరు. ఇండియాలో మనకి మళ్ళీ మళ్ళీ చెబితే కానీ, అవునో కాదో తెలియదు. నిజంగానా. అంతేనా అని అడిగి చెప్పించుకోవాలి. జపాన్‌లో ఏదన్నాచెప్పి అర్థమయిందా అంటే ఎస్ అంటారు. దాని అర్థం అవును అర్థమయింది అనేకాదు, అవును అర్థం కాలేదు అని కూడాను. ఓహో అర్థం కాలేదా యమమోటో సాన్ అంటే, అవును అర్థం కాలేదు అంటాడు యమమోటో సాన్. యమమోటో సాన్ అంటే జపనీస్‌లో యమమోటోగారు అని అర్థం.

అమెరికాలో అన్నీ టైమ్ ప్రకారం నడవాలి. ముఖ్యంగా ఆఫీసు విషయాలు. ఒక్క నిమిషం ఆలస్యమైనా భరించలేరు. వాళ్ళకి క్షణాలే యుగాలు. మనకి యుగాలే క్షణాలు. ఇండియన్ పంక్చుయాలిటీ. సమయానికి విలువ తెలియని సమాజం మనదొక్కటే కాదు. ఇంకా వున్నాయి. లాటిన్ అమెరికాలో గడియారానికి బానిసలవటం వాళ్ళకి ఇష్టం వుండదు. అలాగే తూర్పు యూరప్ దేశాలు.

ఇలా చెప్పుకుంటూ పోతే మూడు గంటల కూచిపూడి నృత్య ప్రదర్శన అవుతుంది. అందుకని ఇక్కడితో ఇది ఆపేద్దాం.

* * *